
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక



**MAY - 2018**

సంవత్సర చందా రూ. 50/-

# వేసవి సెలవల బైబిలు స్కూలు
## Vacation Bible School

సమయం: 2018 జూన్ 10 నుండి 18 వ తేదీ వరకు

ఎవరు రావచ్చును? ముఖ్యముగా యువతీ యువకులు 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకొనువారు రావచ్చును.

స్థలము: సత్యవాణి-క్రీస్తుసంఘము
రామరావుపేట,కాకినాడ-533 004.

ఉపాధ్యాయులు: అమెరికా నుండి వచ్చు యువక బృందము మరియు స్వదేశీ విదేశీ బైబిలు ఉపాధ్యాయులు.

దూరమునుండి వచ్చువారికి ఉచిత భోజనం వసతులు కల్పించబడును. దారి ఖర్చులు ఇయ్యబడును.బైబిలు పుస్తకములు, నోట్‌బుక్స్,పెన్నులు ఉచితముగా సరఫరా చేయబడును.మీ బెడ్డింగ్ మీరే తీసికొని రావలెను.వివరములకు దిగువ సంప్రదించండి.

సత్యవాణి
కాకినాడ

రిక్కీగూటం
98489 98547
0884-2363722

# సత్యవాక్కు

THE WORD OF TRUTH


P.O. Box - 80, Kakinada, A.P. 533 001.
Ph : 0884-2363722 Cell : 98489 98547
Editor
**JOSHUA GOOTAM**


Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 39 | మే - 2018 | సంచిక -10 |
|---|---|---|


## నీకున్న విశ్వాసమెట్టిది ?

### (What kind of faith do you have?)

బైబిలు నందు ప్రాముఖ్యముగ రెండురకములైన విశ్వాసములు మనకు కన్పడుచున్నవి. పనిచేయు విశ్వాసము, పనిచేయనట్టి విశ్వాసము. మానవులకు ప్రయోజనాత్మకము కాని మృతమైన విశ్వాసమునకును, దేవుని కిష్టపూర్వకమైన విధేయత చూపించు నట్టి విశ్వాసమునకును గల వ్యత్యాసము దేవుని గ్రంథమందు మనకు విపులముగా కనబడుచున్నది. దేవునిచే ఆశీర్వదింపబడవలెనని కోరు ప్రతి మానవుడు దేవుని ఆజ్ఞలకు లోబడవలసినదే. దేవునియందు నమ్మికయుంచియు ఆయన మాటలకు లోబడని మనుష్యుడెవడు ఆయన నుండి దీవెనలు గాని, రక్షణ గాని పొందినట్టి సంఘటన బైబిలులో ఒక్కటి కూడా లేదు. అట్టి ఆశీర్వాదములను పొందియుంటే వారు తమ విశ్వాసమును క్రియలద్వారా నిరూపించుకొనినవారైరి.

రక్షించునట్టి విశ్వాసము ప్రేమ వలన కార్యసాధకమగు విశ్వాసమని క్రొత్త నిబంధన బోధించుచున్నది.

'యేసుక్రీస్తు నందుండు వారికి సున్నతి పొందుట యుందేమియు లేదు, పొందక పోవుట యందేమియు లేదు గాని ప్రేమవలన కార్యసాధకమగు విశ్వాసమే ప్రయోజమగును" అని గలతీ 5:6లో వ్రాయబడి యున్నది. "మన మాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట" (1 యోహాను 5:3).

పరిశుద్ధాత్మావేశ లేఖకుడగు యాకోబు విధేయత లేని విశ్వాసము యొక్క నిష్ప్రయోజనమును ఇట్లు వివరించు చున్నాడు. "నా సహోదరు లారా, క్రియలు లేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా?... అయితే ఒకడు నీకు విశ్వాసమున్నది, నాకు క్రియలున్నవి, క్రియలు లేకుండ నీ విశ్వాసము నాకు కనుపరచుము, నేను నా క్రియలు చేత నా విశ్వాసము నీకు కనపరతునని చెప్పును... మనుష్యుడు విశ్వాసమూలమున మాత్రము కాక క్రియల మూలముననను నీతిమంతుడని యెంచబడును... ప్రాణములేని శరీరము ఏలాగు మృతమెూ ఆలాగే క్రియలు లేని విశ్వాసము మృతము" (యాకోబు 2:14, 18, 24,26).

మానవులందరు దేవునియందు విశ్వాసము కలిగి యుండవలెనని దేవుడు కోరుచున్నారు. అయితే అది విధేయతతో కూడిన విశ్వాసమైతేనే ఆయన వారిని అంగీకరించును. అట్టి విశ్వాసమును బట్టి మాత్రమే ఎవడు ఎన్నడు ఆయనచే అంగీకరింప బడలేదు. బైబిలు అంతటిలోను ఈ సూత్రము మనకు మనకు కనబడు చున్నది.

విశ్వాసమును బట్టి హేబెలు శ్రేష్ఠమైన బలిని దేవునికి అర్పించెను. అతడు దేవుని మాటలను విని విశ్వసించి వాటికి లోబడెను. దేవుడు గొర్రెపిల్ల రక్తమును బలిగా కోరగా అతడు తన స్వబుద్ధిని వినియోగించి వేరొక దానిని అర్పించలేదు. అతడట్ల చేసియుండినయెడల అది అవిధేయత

యగును. కాని హేబెలు అయితే దేవుడేమి చెప్పెనో దానినే చేసెను. నీతిమంతుడని తీర్పు పొందెను.

విశ్వాసమును బట్టి నోవహు ఒక ఓడనునిర్మించి తనకు తానును, తన కుటుంబమును రక్షించుకొన గల్గెను. "దేవుడు నోవహుతో సమస్త శరీరుల మూలముగా భూమి బలత్కార ముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చియున్నది. ఇదిగో వారిని భూమితో కూడ నాశనము చేయుదును. చితిసారకపు మ్రానుతో నీకొరకు ఓడను చేసి కొనుము. నీవును, నీతోకూడ నీ కుమారులును నీ భార్యయు, నీకోడండ్రును అ ఓడలో ప్రవేశింప వలెను" అని చెప్పగా, దేవుడు చెప్పినట్లే సమస్తమును జరుగునని నోవహు విశ్వసించెను. అంతేకాదు, నోవహు దేవుని మాటలను అక్షరాల పాటించి ఓడను నిర్మించెను. రక్షించబడెను (ఆది 6:5-22). ఒకవేళ నోవహు దేవుని మాటలను వినియు వాటి చొప్పున చేయని యెడల రక్షించ బడి యుండునా? అట్లు కానేకాదు.

అట్లే అబ్రాహాము కూడాను. అబ్రహాము దేవుని నమ్మెను. అది అతనికి నీతిగా యెంచబడెను. అయితే అబ్రాహాము దేవుని అజ్ఞలకు విధేయత చూపెను గనుక నీతిమంతుడని తీర్చబడెను. అబ్రాహాము దేవుని యందు తనకున్న విశ్వాసమును క్రియా పూర్వకముగా నిరూపించెను. "అబ్రహాము శోధింపబడి విశ్వాసమును బట్టి ఇస్సాకును బలిగా అర్పించెను. ఆ అబ్రాహాము, మృతులను సహితము లేపుటకు దేవుడు శక్తిమంతుడని యెంచినవాడై తన యేక కుమారుని అర్పించి ఉపమాన రూపముగా అతనిని మృతులలో నుండి మరల పొందెను" (హెబ్రీ 11:17-19).

బైబిలు గ్రంథములో అనేక విశ్వాసవీరులను గూర్చి మనము చదువగలము. వారందరు దేవుని యందు తమకున్న విశ్వాసమును

క్రియా పూర్వకముగా కనుబరచిరి. నీతిమంతులని తీర్చబడిరి. అయితే మానవుడు ఎప్పుడు దేవుని మాటలకు అవిధేయత చూపెనో ఆనాడే దేవుడ తనిని తిరస్కరించినట్లు మనము దైవగ్రంధమందు చూడగలము. క్రియలు లేని విశ్వాసము మృతము. మృతమైన విశ్వాసము దేవుని కయిష్టమైనది.

ఆదాము హవ్వలు దేవుని మాటకు అవిధేయులై బహిష్కరించ బడిన ఫలమును తినిరి. ఒక తృటి కాలములోనే దేవుని దృష్టిలో వారు అవిశ్వాసులు, అవిధేయులైరి. ఏదేను వనము నుండి పారద్రోలబడిరి. కయీను దేవుని మాట నాలకించియు తన యిష్టప్రకారము దేవుని నారాధించగోరెను, తిరస్కరించబడెను. అట్లే నోవహు, నాటి ప్రజలు కూడాను వృద్ధుడైన నోవహు దేవుని ఉగ్రతను గూర్చియు, రాబోవు జలప్రళయమును గూర్చియు బోధించుచుండగా అనేకులు అతనిని హేళన చేసిరి. అవిశ్వాసులై ఓడలో ప్రవేశించకపోయిరి. దేవుడు కలుగజేసిన గొప్ప జలప్రళయములో వారందరు నాశనమైపోయిరి. ఎందు వలన? అవిధేయతవలన.

దేవునికి ఇష్టము లేకపోయినను ఆయన ఇశ్రాయేలీయులకు ఒక రాజు ననుగ్రహించెను. సౌలును వారిపై రాజుగా అభిషేకించిన తరువాత, నీవు పోయి అమాలేకీయులను కనికరిపంక హతము చేయుచు, పురుషులనేమి స్త్రీలనేమి బాలురనేమి, పసిపిల్లలనేమి, గొర్రెలనేమి, గార్థభములనేమి అన్నిటిని హతము చేసి వారికి కలిగినదంతయు బొత్తిగా పాడుచేసి అమాలేకీయులను నిర్మూలము చేయుము అని యెహోవా దేవుడు అతనిని ఆదేశించెను. అయితే సౌలు అట్లు చేయక అమాలేకీయుల రాజైన అగగును ప్రాణముతో పట్టుకొని గొర్రెలలోను, ఎడ్లలోను, క్రొవ్విన గొర్రెపిల్లలు మొదలైన వాటిలోను మంచివాటిని నిర్మూలముచేయక దేవుడైన యెహోవాకు బలులు అర్పించుటకై ఉండనిచ్చెను. ఈ

విషయములలో సౌలు దేవుని అనుసరింపక, ఆయన ఆజ్ఞలను గైకొనక పోయెను. అవిధేయత చూపెను గనుక రాజుగా అతడు నిర్మూలించ బడెను. “ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞను గైకొనుటయు, పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుటకంటె మాట వినుటయు శ్రేష్టము” అని దేవుడు ఈనాడు కూడ మనలను హెచ్చరించు చున్నాడు (1సమూ 15:22).

నీవు క్రీస్తునందున్న విశ్వాస మెట్టిది ? మృతమైనదా? లేక సజీవమై కార్య సాధకమైనదా? పరీక్షించు కొనుము. ఆయన ఆజ్ఞలకు లోబడ కుండ వట్టి విశ్వాసము మాత్రమే నీకున్న యెడల అదేమి ప్రయోజనము? అట్టి విశ్వాసము నిన్ను రక్షించగలదా?

క్రీస్తునందున్న నీ విశ్వాసము వలనను పాపముల విషయమైన మారు మనస్సు వలనను నీవు రక్షించ బడగలవు. మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు ఆలాగే నశింతురు అని యేసుప్రభువు చెప్పుచున్నారు (లూకా 13:3). నీవు విశ్వాసము, బాప్తిస్మములవలన రక్షింప బడుదువు. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని యేసే చెప్పెను (మార్కు 16:16). నమ్మనొల్లని వానికి శిక్ష విధింప బడును.

నీవు క్రీస్తునందున్న విశ్వాసము నకు బాప్తిస్మము పొందుట ద్వారా విధేయత చూపించిన తరువాత, జీవితాంతము వరకు విధేయతతో కూడిన విశ్వాస జీవితమును జీవించుము. ఎందువలనంటే, అంతము వరకు సహించినవాడే రక్షించబడును. మరణ పర్యంతము నమ్మకముగా యుండుము, నీకు నిత్య జీవ కిరీటము నిచ్చెదను అని ప్రభువైన యేసు సెలవిచ్చుచున్నారు (మత్తయి 10:22, ప్రకటన 2:10).

నీకున్న విశ్వాసమెట్టిది? నిన్ను నీవే పరీక్షించుకో, క్రీస్తు ఆజ్ఞలకు విధేయుడవై నిన్ను నీవే రక్షించుకో.

# మంచి దేవుడు

## ( God is Good )

దేవుడు మన సమస్యలను పరిష్కరించినప్పుడు, ఆయన శక్తి యందు మనము నమ్మకముముంచుతాము. ఆయన మన సమస్యలను పరిష్కరించనప్పుడు మన యందు ఆయన నమ్మకముంచుతారు.

గుడ్లుపొదగబడు పద్ధతిలో యున్న క్రమమును మనం ఆలోచించితే ఆశ్చర్యపడుదుము : పక్షిజాతి గుడ్లు 14 రోజులలో పొదగబడును, పెంపుడుకోళ్ళు గుడ్లు 21 దినములలోను, బాతు గుడ్లు 28 దినములలోను, అడవిబాతుగుడ్లు 35 దినములలోను, చిలుక మరియు నిప్పుకోడిగుడ్లు 42 దినములలోను పొదగబడును.

ఆశ్యర్యం యేమంటే ఈ దినముల సంఖ్యలన్నియు 7తో విభాగింపబడును. వారములో 7 దినములున్నవని గమనించుము!

ఏనుగును సృష్టించుటలో దేవుని యొక్క జ్ఞానమును గమనించుము. ఈ భారీయెత్తున యున్న గొప్ప జంతువు యొక్క నాలుగు కాళ్ళు ఒకేసారి ముందుకు వంగును! నాలుగు కాళ్ళు గల మరియే జంతువు అట్లు చేయబడలేదు. ఈ జంతువు యొక్క శరీరము భారీయెత్తున ఉండునట్లు దేవుడు దాన్ని సృజించారు. రెండు కాళ్లమీదనే జీవించుటకది చాలా పెద్ద జంతువు గనుక దేవుడు దానికి నాలుగు గజస్తంభముల నిచ్చారు! వాటితో అది సులభముగా లేచి నిలువగలదు! గుర్రము పండుకొని నప్పుడు దాని ముందు కాళ్లతో లేచినిలుచును. ఆవు మాత్రము దాని వెనుక కాళ్ళ సహాయముతో లేచినిలుచును.

తాను చేసిన సృష్టియంతటిలోను దేవుడు ఎంత జ్ఞానవంతుడో!!

దీనినెప్పుడైనా గమనించారా! ప్రతి పుచ్చకాయమీదనున్న చారలు ఎప్పుడు సరిసంఖ్యలోనే యుండును.

ప్రతినారింజపండులోని తొనలు సరిసంఖ్యలోనే యుండును. ప్రతి

జొన్నపొత్తులో యున్న వరుసలు సరిసంఖ్యలోనే యుండును. గోధుమ వెన్నులోని గింజలన్నియు సరిసంఖ్య లోనే యుండును.

అరటిపండ్ల గెలలోని చివరి వరుసలో యున్నపండ్లు ఎప్పుడు సరిసంఖ్యలోనే యుండును. మరియు ప్రతి హస్తములో యున్న పండ్లు వరుసకు ఒకటి తక్కువగా యుండును. గనుక ఒక వరుసలో సరిసంఖ్య యున్నట్లయితే మరియొక దానిలో బేసి సంఖ్యపండ్లుండును.

యిది ఎంత ఆశ్చర్యమో!

సముద్ర కెరటములు అన్ని వాతావరణములలోను నిమిషమునకు 26 సార్లు దరికి చేరును.

అన్నిరకాల ధాన్యముల వెన్నులలో యున్న గింజలన్నియు సరి సంఖ్యలోనే యుండును.

దినములో ఒక ప్రత్యేక సమయ మందు పువ్వులు విడుచుకొనునట్లు దేవుడు చేసారు. సరియైన వాతావరణము, నేల, వగయిరా యున్నట్లయితే ఏ పువ్వు రాత్రివేళగాని పగటివేళగాని, ఏ సమయమునకు విడుచుకొనునో చెప్పవచ్చునని లెన్నియస్ అనుగొప్ప జీవశాస్త్ర సంబంధ వైజ్ఞానికుడు చెప్పాడు.

మనలో ప్రతివాని జీవితము దేవునికి మహిమ తెచ్చునట్లు దేవుడు నియమించారు. దేవునిని బట్టి గాక మన నియమాల చొప్పునే జీవించాలను కొన్నప్పుడు నిరాశ నిస్పృహలనెదుర్కొన వలసివచ్చును.

మన మెదడును, హృదయాన్ని చేసిన దేవుడు మాత్రమే మనకు మేలు కలుగునట్లు వాటిని నడిపించగలడు.

నీవు బైబిలును చేతపట్టుకొని నప్పుడు సాతానుకు తలనొప్పి మొదలగును. దానిని తెరచినప్పుడతడు కూలబడును. నీవు దానిని చదువునప్పుడు వాడు తన బలమును కోల్పోవును. నీవు దానిమీద నిలబడునప్పుడు అపవాది నిన్నేమీ చేయలేడు!

నీకు తెలుసా! దేవుడు లేని జీవితము చెక్క బడకుండా యున్న పెన్సిల్ వలె మొద్దుబారి యుండును!.

# నీవు మారుమనస్సు పొందినట్లు నీకెట్లు తెలియును?

## ( How can we know we have Repented )

ప్రతివాడు మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరుచున్నారు. ఏలయనగా మనుష్యులందరు పాపము చేసినవారే (రోమా 3:23). వారు మారుమనస్సు పొందని యెడల అందరు నశింతురు. 2పేతురు 3:9లో దీనిని దేవుని వాక్యము మనకు తెలియ జేయుచున్నది. "కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయు వాడు కాదు గాని యెవడును నశింప వలెనని యిచ్ఛయింపక అందరు మారు మనస్సు పొందవలెనని కోరుచు మీ యెడల దీర్ఘశాంతము గలవాడై యున్నాడు".

పాపమును గూర్చి విచారించుట మారుమనస్సు కాదు గాని సరియైన దు:ఖము మారు మనస్సు పొందుటకు నడిపించును. "దైవ చిత్తానుసారమైన దు:ఖము రక్షణార్ధ మైన మారుమనస్సు కలుగ జేయును. ఈ మారుమనస్సు దు:ఖము పుట్టించదు. అయితే లోక సంబంధమైన దు:ఖము మరణమును కలుగ జేయును" (2 కొరింధీ 7:10). తాను చేసిన పాప పర్యవసానము వలన ఒకడు తన పాపమును గూర్చి దు:ఖ చిత్తుడైతే అది ఈలోక సంబంధమైనది. అయితే అతని దు:ఖము దైవచిత్తాను సారమైనదైతే అతడు పాపమును ద్వేషించి దేవుని ప్రేమించును.

ప్రవర్తనలో మార్పు మారు మనస్సు కాదు గాని మారుమనస్సు ప్రవర్తనలో మార్పు తెచ్చును. యేసు ఇట్లు చెప్పారు : "మీ కేమి తోచు చున్నది? ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటి వాని యొద్దకు వచ్చి కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయమని చెప్పగా వాడు పోను అని యుత్తరమిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. అతడు రెండవవాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు, అయ్యా పోదుననెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్ట

ప్రకారము చేసినవాడని" ఆయన అడిగెను (మత్తయి 21:28,29).

గనుక మారుమనస్సు దైవ చిత్తానుసారమైన దు:ఖమును బట్టి కలుగు హృదయ మార్పు అయ్యున్నది. హృదయము ప్రవర్తనను నడిపించును. గనుక హృదయము మార్పువలన ప్రవర్తనలో మార్పు కలుగును.

**మారు మనస్సు యొక్క నిదర్శనములు :**

మారుమనస్సు యొక్క లేఖనార్ధమైన భావము నెరిగిన వారమై మనము దేవుని యెడల మారుమనస్సు పొందామో లేదో పరీక్షించుకొనవచ్చును.

మనము మారుమనస్సు పొందితే పాపమును, అన్నిరకాల పాపమును ద్వేషిస్తాము. అది దేవుని దృష్టికి అనహ్యమైనది గనుక మనమును పాపమును ద్వేషిస్తాము.

మనము మారుమనస్సు పొందితే నీతిని ప్రేమిస్తాము. ఏలయనగా నీతి దేవునికి ప్రీతికరమైనది. దేవుడు ప్రేమించు దానిని మనము ప్రేమిస్తాము.

మనము మారుమనస్సు పొందినప్పుడు దాని వలన దేవుని చిత్తమును ఉల్లఘించినవారమని గ్రహించి తక్షణమే దు:ఖిస్తాము.

మనము మారు మనస్సు పొందితే దేవునికయిష్టమైనదేదయినను చేయుటకు నిరాకరించెదము.

మనము మారు మనస్సు పొందిన యెడల నీతికొరకు ఆకలిదప్పులు గలవారమై యుందుము (మత్తయి 5:6). దేవుని సత్యమును ప్రేమించుదుము. దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). "నీ వాక్యమే సత్యము" అని యేసుప్రభువు చెప్పారు. మనము సత్యమును కనుగొను ఒకే ఒక్కస్థావరము అదే. అదే దేవుని వాక్యము. ఆయన సత్యము కొరకు బైబిలు గ్రంథమును అన్వేషించు, చదివి ధ్యానించు. దాని ప్రకారము జీవించు.

-ఓ.పి.బైర్డ్

# పేరు లేని సంఘము

## ( A Nameless Church )

చాలా సంఘాలకు ప్రత్యేక పేర్లున్నాయి. కాని క్రొత్తనిబంధన సంఘమునకొక నామము లేదు. డినామినేషన్లకు ప్రత్యేక పేర్లున్నాయి. డినామినేట్ అనగా ఒక దానికి పేరు పెట్టుటయని అర్థము. క్రొత్తనిబంధన సంఘము దేవుని మందిరము, దేవుని కుటుంబము, క్రీస్తు శరీరము, క్రీస్తు రాజ్యము అని పిలువబడినది (గలతీ 6:10; ఎఫెసీ 1:22,23; కొలస్స 1:13; హెబ్రీ 3:5,6; 1తిమోతి 3:15). గాని దానికొక నామవాచకము లేదు.

క్రొత్తనిబంధన సంఘములోని వ్యక్తిగత సభ్యులకొక నామవాచకమున్నది. శిష్యులు అనునదివారి నామము కాదుగాని వారు శిష్యులే (అపొ.కా.9:1). వారు సహోదరులు, సహోదరీలు అయినను అది వారి పేరు కాదు (అపొ.కా.9:30). వారు పరిశుద్ధులే అయినను పరిశుద్ధులు అనునది వారి నామము కాదు (అపొ.కా.9:32). దైవికంగా వారికి అనుగ్రహించబడిన నామము క్రైస్తవులు అను నామము (అపొ.కా.11:26; 1 పేతురు 4:16). అయితే సంఘము క్రైస్తవ సంఘము (క్రిస్టియన్ చర్చ్) కాదు. క్రీస్తు స్థాపించిన అత్యంత ఉన్నతమైన సంఘము ఒకడినామినేషన్ కాదు.

క్రొత్త నిబంధన సంఘమును క్రీస్తు సంఘము అని పిలుచుట సరియైనదే. అది దేవుని సంఘము (రోమా 16:16; 1కొరింథీ 1:2) అయితే ఈ రెంటిలో యేది ఒక నామవాచకము కాదు. క్రీస్తు సంఘమనగా అది క్రీస్తుకు చెందినట్టిది. దానిని ఆయన స్వరక్తమిచ్చిన సంపాదించారు (అపొ.కా.20:26). అది ఆయనదే. గాని మరెవరిదీ కాదు.

## హింసింపబడిన సంఘము

## ( The Persecuted Church)

స్ముర్నలో యున్న సంఘమునకు ప్రభువు వ్రాసిన లేఖ తమ విశ్వాస పరీక్షను ఎదుర్కొనుచున్న వారికి ఆదరణకరమైన మాటలతో నిండి యున్నది. ఎఫెసునకు 40 మైళ్ల ఆగ్నేయముగా స్ముర్ణయున్నది. అలెగ్జాండరు చక్రవర్తి వలన అది మొదట్లో నిర్మించబడెను. అక్కడ వుండే పెద్ద గ్రంథాలయము అలెగ్జాండ్రియాకు తరలించబడెను. ఒలింపిక్ క్రీడలకు అది కేంద్రమై యుండెను. క్రీ.పూ. 23 నాటికి ఆ పట్టణము తిబెరియ చక్రవర్తికి ఒక ఆలయము నిర్మించి, చక్రవర్తి పూజకు ఆసియాలో నాంది పలికెను. డొమెషియన్ చక్రవర్తి కాలములో యిది మరింత ప్రబలి యుండెను. ఆ పట్టణములో అసంఖ్యాకమైన యూదులు కాపురముండే వారు. అక్కడున్న క్రీస్తుసంఘము ఘోరమైన హింసలను, మరణ శిక్షలను ఎదుర్కొనుచుండెను. అయితే యేసు నిత్యుడని, సమాధిని జయించిన వాడని గ్రహించి స్ముర్నలో యున్న సంఘము ఆదరణపొందెను (ప్రకటన 2:8-10).

శ్రమలనెదుర్కొను వారు ఏకాకులమని తలంచుట సులభమే. మరియు వారిని గూర్చి ఎవరు చింతించుట లేదనే భావము కూడ వారికి కలుగును. అయితే ప్రతి వ్యక్తి ఎదుర్కొనిన, ఎదుర్కొనుచున్న, ఎదుర్కొనబోవుచున్న హింసలను, బాధలను యేసు ఎరుగును. ఆ శ్రమలను భరించుటకు ఆయన సహాయమును వాగ్దానము చేసెను (హెబ్రీ 2:17-19; 4:5-16; 2

కొరింథీ 10:13). ప్రభువు వారి యొక్క దారిద్ర్యమును కూడ ఎరిగి యుండెను. నిజానికి ఆయనే అట్టి పరిస్థితులను ఎదుర్కొనెను (మత్తయి 8:20). ఇహ సంబంధమైన ధనమును కూర్చు కొనుటకు క్రైస్తవులు కేంద్రీకరించ రాదు (మత్తయి 6:19,20). స్ముర్నలో యున్న సంఘము భౌతికంగా కడుపేదదే గాని ఆత్మీయంగా చాలా ధనిక సంఘము. తాము యూదులమని చెప్పుకొనుచు యూదులు కాక సాతాను సమాజపు వారి వలన స్ముర్నలో యున్న సంఘము ఎదుర్కొనుచున్న దూషణను ప్రభువు ఎరుగును (ప్రకటన 2:9). అక్కడ యూదుల సమాజమందిరమొకటి యుండెను గాని అది సాతాను సమాజ మందిరమని ప్రభువు చెప్పెను. క్రైస్తవ యుగములో హృదయమందు అంతరంగిక సున్నతి పొందిన వారే ప్రభువు యొక్క నిజమైన ఇశ్రాయేలీయులు (ప్రకట 2 : 9; రోమా 2:28,29; ఫిలిప్పీ 3 : 3).

ఇంకా ఘోరమైన శ్రమలు వారికి కలుగబోవుచున్నను వారు వాటిని సహింతురు. వారి శ్రమలు ఒకానొక దినమందు అంతమగునని స్ముర్నలో యున్న సంఘమునకు ఆదరణ ఇయ్యబడెను (2తిమో 3:12; ఫిలిప్పీ 1:29). సంఘము యొక్క అసలైన శత్రువు అపవాదియైన సాతాను. అపవాదియనగా నిందలు మోపువాడు (యోహాను 8:44; 1పేతురు 5:8; లూకా 22:31). క్రైస్తవులు పాపముచేయునట్లు వాడు శక్తి కొలది ప్రయత్నించును; వారిని చెరసాలలో వేయించును, దేశము నుండి బహిష్కరింపజేయును, లేదా చంపించును. క్రైస్తవులు వీటిని గూర్చి యేమీ భయపడనక్కరలేదు. వారు విశ్వాసములో నమ్మకముగా యున్న

యెడల తమ విశ్వాసము వలన మరణము సంభవించును, నిత్య జీవ కిరీటము తమదగును (ప్రక 2:10; లూకా 12:4,5; యాకోబు 1:12; 2 తిమో 4:6-8; 1పేతురు 5:4; 1 కొరింథీ 9:25).

స్ముర్న ఒలింపిక్ క్రీడలకు కేంద్రమని గుర్తుంచుకొనుము. అందు వలన నిత్యజీవము ఒక విజయ కిరీటముగా వర్ణించబడినది. ఈ లేఖ లోని సంగతులను సహోదరులు గ్రై కొనాలి. అట్లయితే రెండవ మరణము వారిని యేమీచేయదు (ప్రక 2:10,11; 20:14; రోమా 6:23). విజయం సాధించువారికి అట్టి విరుగుడు వాగ్దానము చేయబడినది.

నేడు మనమెవరు ఎదుర్కొనని హింసలను స్ముర్నలోని క్రీస్తుసంఘము ఎదుర్కొన్నది. వారు శ్రమనొందినా, నమ్మకముగా యుండిరి. మరణ పర్యంతము నమ్మకముగా యుంటే నిత్య జీవకిరీటము వారికి వాగ్ధానము చేయబడినది. ఆనాటి క్రైస్తవులను చూచి నేటి క్రైస్తవులు విశ్వాసములో నమ్మకముగా యుంటే, విజయ చిహ్నమైన జీవకిరీటము లభించును.

-గేరీ హేంప్టన్


మీరు సత్యవాక్కు సాలు చందాకట్టారా? లేని యెడల ఇప్పుడే రూ.50/-లు ఎమ్.ఒ. చేసి మీ సభ్యత్వమును కొనసాగించు కొనండి.

సత్యవాణి

7-9-35, సాంబమూర్తి వీధి, కాకినాడ - 533 004.

# ప్రసంగ మూలికలు

## ( Sermon Starters )

**1. సమస్తము క్రొత్తవాయెను :**

లేఖన భాగము : 2 పేతురు 3:10-13

నూతన జీవము : రోమా 6:4

నూతన సృష్టి : 2 కొరింథీ 5:17

క్రొత్త నిబంధన : మత్తయి 26:28

క్రొత్త ఆజ్ఞ : యోహాను 13:34

నూతన స్వభావము గల మనుష్యుడు ఎఫెసీ 4:24

ముగింపు : ఒకడు నూతనముగా జన్మించినప్పుడు (యోహాను 3:3) అది క్రొత్త జన్మయగును.

**2. మాతో కూడ విశ్రాంతి పొందుడి :**

లేఖనభాగము – 2 థెస్స 1:7 మీకు, మాకు విశ్రాంతి.

దేవుడు ఏడవ దినమందు విశ్రమించెను. ఆది.కా. 2:2

సబ్బాతు నాడు యూదులు విశ్రమించిరి. యెహోషువా 1:13

పాపులు యేసునొద్దకు వచ్చినప్పుడు విశ్రాంతి పొందుదురు (మత్తయి 11:28-30)

రక్షింపబడిన వారు పరలోకములో విశ్రాంతి పొందుదురు. హెబ్రీ 4:9-11; ప్రకటన 14:13).

ముగింపు : ఒక నిత్య విశ్రాంతి ననుభవించాలంటే అతడు ఇక్కడ విశ్రాంతిలో ప్రవేశించాలి (మత్తయి 11:28).

**3. పరలోకము ఎంతో ప్రశస్తమైనది :**

లేఖనభాగము : ఫిలిప్పీ 1:23, 2 పేతురు 3:13, క్రొత్తభూమి, క్రొత్త ఆకాశము.

పరలోకములో నూతన విశ్రాంతి

కలుగును హెబ్రీ 4:9.

పరలోకములో నూతన సంబంధ ముండును 1 థెస్స 4:17.

పరలోకములో నూతన బహుమాన ముండును మత్తయి 5:12.

ముగింపు : నీ నూతన గృహము పరలోకమా?

**4. మన దేవుడు సజీవుడైయున్నాడు!**

లేఖనభాగము : కీర్తన 91:1,2, నీ పూర్ణశక్తితో దేవుని యందు విశ్వాస ముంచుము.

దేవుడు సర్వోన్నతుడు కీర్తన 91:1.

దేవుడు సర్వశక్తిమంతుడు కీర్త 91:1

దేవుడు యెహోవా ప్రభువు కీర్తన 91:2

దేవుడు నా దేవుడు కీర్తన 91:2

ముగింపు : దేవుని యందు విశ్వాస ముంచుము. ఆయనే మన రక్షకుడు.

**5. పిచ్చి వానిలో కలిగిన గొప్ప మార్పు :**

లేఖనభాగము : మార్కు 5:14-20

యేసు అతనిని మార్చారు. అతని వేధించుచున్న అపవిత్రాత్మలను యేసు వెళ్ళగొట్టారు.

యేసు వలన అతడు మరల వస్త్రధారు డయ్యాడు.

యేసు అతని శాంతిపర్చారు. అతడిక మీదట దిగంబరిగాక, వస్త్రధారు డయ్యాడు.

యేసు అతనికి చేయ పనినప్ప గించారు. తన బంధుమిత్రుల దగ్గరకు ఆయన అతనిని పంపివేసారు.

అతడు ఇతరులతో పంచుకొను నిమిత్తము వర్తమానమును యేసు అతనికిచ్చారు.

**6. క్రైస్తవులుగా ఎల్లవేళలా విస్తరించాలి**

లేఖనభాగం : 2 పేతురు 1:8

విశ్వాసములో విస్తరించాలి (2 కొరింథీ 8:7)

నిరీక్షణలో విస్తరించాలి (రోమా 15:13).

ప్రేమలో విస్తరించాలి (ఫిలిప్పీ 1:9).

సత్క్రియలలో విస్తరించాలి (2 కొరి 9:8).

ప్రభువుపనిలో విస్తరించాలి (1కొరింథీ 15:58).

**7. దేవుడు సమర్థుడు :**

లేఖన భాగం : ఎఫెసీ 3:20.

దేవుని ఐశ్వర్యము శోధింపనశక్యము (ఎఫెసీ 3:8).

దేవుని సంతోషము చెప్పనశక్యము (1 పేతురు 1:8).

దేవుని సమాధానము సమస్త జ్ఞానము నకు మించినది (ఫిలిప్పీ 4:7).

క్రీస్తు ప్రేమ జ్ఞానమునకు మించినది (ఎఫెసీ 3:9).

దేవుని మార్గముల అడుగు జాడలు పట్టనశక్యము (రోమా 11:33).

**8. క్రీస్తు యొక్క అవతారము :**

లేఖనభాగము : 2 కొరింథీ 8:9

"మీరు మన ప్రభువైన యేసు కృపను ఎరుగుదురు గదా".

ప్రభువు - ఆయన దైవత్వమును సూచించును.

యేసు - ఆయన మానవత్వమును సూచించును.

క్రీస్తు - ఆయన దైవిక కర్తవ్యమును సూచించును.

"చెప్పశక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రములు" (2 కొరింథీ 9:15).

**9. ఫిలిప్పు బోధించినది :**

అపొ.కా. 8:12 "అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసు

క్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి".

**సంఘము :** ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చి బోధించెను (అపొ.కా. 2:47).

**అధికారము :** ఫిలిప్పు యేసుక్రీస్తు నామమందలి అధికారమును గూర్చి బోధించెను (ఫిలిప్పీ 2:9-11)

**రక్షణ :** ఫిలిప్పు బాప్తిస్మమును గూర్చి బోధించెను (అపొ.కా. 2:38; 22:16).

**ముగింపు :** "అప్పుడు సీమోను కూడ నమ్మి బాప్తిస్మము పొంది ఫిలిప్పును ఎడబాయకుండి, సూచకక్రియలు గొప్ప అద్భుతములు జరుగుట చూచి విభ్రాంతి నొందెను" (అపొ.కా. 8:13).

10. యేసును చూచుచున్నాము :

లేఖనబాగం : హెబ్రీ 2:9

యేసుక్రీస్తును దేవుని కుమారునిగా చూచుచున్నాము. యోహాను 1:49, 20:31

యేసుక్రీస్తును మనుష్యకుమారునిగా చూచుచున్నాము లూకా 9:22; 19:10.

యేసుక్రీస్తును పాపపరిహార్థ బలిగా చూచుచున్నాము హెబ్రీ 9:22; 10:12.

యేసుక్రీస్తును పాపుల రక్షకునిగా చూచుచున్నాము 1తిమో 1:15, రోమా 5:8.

– మార్క్ పోసీ



# అసూయ - ఒక భయంకర పాపము

## ( Envy a Deadly sin )

ఎవరికైనా అదృష్టము కలిసివస్తే నీవు సంతోషించెదవా? ఉద్యోగములో నీకంటే ముందుగా ఎవరికైనా ప్రమోషన్ వస్తే నీవు సంతోషించెదవా? నీవు చేసినదానికి నీకు మెప్పు రాకపోయినను యితరులు చేసిన దానికి వారికి మెప్పువస్తే నీవు సంతోషించెదవా? యిట్టి పరిస్థితుల్లో చాలాసార్లు మనం సంతోషముగా యుండము. దానికంతటికి కారణము అసూయ. ఇతరులకు కలగిన మేలులు ఆస్థి మొదలైన వాటిని గూర్చిన అసంతృప్తి, దున్వభావములే అసూయయని నిఘంటువు పరంగా మనం చెప్పుకోవచ్చును. తాను కోరేది మరొకడు కలిగి యున్నప్పుడు కలిగే నిరసనభావం అసూయ.

అసూయ సర్వసామాన్యమైన ఒక సమస్య. అది భౌగోళిక సరిహద్దుల నేమీ ఎరుగదు, అది యౌవనులలోను, వృద్ధులలోను, ధనవంతులలోను, దరిద్రులలోను, ఉపదేశకునిలోను, విద్యార్థిలోను కనబడును. అసూయ నుండి విడుదల పొందిన వాడెవడు మనకు కనబడకపోయినను, ఈ పాపాన్ని కనుగొనడం అంత సులభ మయిన పనికాదు, ఎందుకంటే, ఒక నేరస్థుడు తన రూపురేఖలను కప్పి పుచ్చులాగున అసూయ అనేక నామకరణములను ధరిస్తొంది. అనేకమైన యితర పాపములలోను మన సంతోషాన్ని నాశనం చేయుటకు సాతానుడు వినియోగించే అతి ప్రమాద కరమైన పనిముట్టు అది.

**ఈ లోకములో మొట్ట మొదటి నరహత్యకు కారణము అసూయే.** ఏలయనగా అసూయను బట్టియే కయీను తన తమ్ముడైన హేబేలును

హత్య చేసెను (ఆది. 4-1-8). అసూయ వలన యోసేపు సహోదరులు అతనిని బానిసగా అమ్మివేసిరి (ఆది 37). దేవుడు మోషే అహరోనుల కిచ్చిన ప్రముఖ స్థానములను గూర్చి కోరహు దాతాను అబీరాములు అసూయ చెంది తిరుగుబాటు చేసిరి. దేవుడు ఆ ముగ్గురినీ వారి అనుచరులగు రెండు వందల యాభైమందినీ నాశనము చేసెను (సంఖ్యా 16). ఈ ప్రపంచ చరిత్రయంతటిలోను అతి ఘోరమైన పాపకృత్యమును, దేవుని కుమారుడైన యేసుక్రీస్తును సిలువ వేయించుటలో యున్న పాపములలో అసూయ ఒకటి. పిలాతు యేసును విడుదల చేయ గోరెను, "ఏలయనగా వారు అసూయ చేత ఆయనను అప్పగించిరని అతడు ఎరిగి యుండెను" (మత్తయి 27:18)

అసూయ మన జీవితమును నెమ్మదిగా కొరికివేయునట్టి రోగము వంటిది. అది మితిమీరిపోయేవరకు అనేకసార్లు అది కనబడక యుండును. "సాత్వికమైన మనస్సు శరీరమునకు జీవము. మత్సరము ఎముకలకు కుళ్ళు" (సామెతలు 14:30). "అయితే మీ హృదయములలో సహింపనలవికాని మత్సరమును వివాదమును ఉంచు కొనిన వారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధ మాడవద్దు. ఈ జ్ఞానము పై నుండి దిగివచ్చినది కాక భూసంబంధమైనదియు దయ్యముల జ్ఞానము వంటిదియునై యున్నది. ఏలయనగా మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచ కార్యమును ఉండును" (యాకోబు 3:14-16).

మత్సరముతోబాటు మిళితమై యున్న మరికొన్ని ఇతర పాపములను గమనించుము. కొంతమంది అన్య జనులు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వము చేతను, లోభముచేతను,

ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్యకలహము కపటవైరమను వాటితో నిండిన వారై యుండిరని పౌలు చెప్పెను (రోమా 1:29). అందువలన "అల్లరితో కూడిన ఆటపాటలైనను మత్తయినను లేకయు, కామవిలాసము లైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు పగటి యందు నడుచుకొన్నట్లు మర్యాదగా నడుచుకొందము" అని పౌలు మరల చెప్పుచున్నాడు (రోమా 13:13).

యితరులకు అదృష్టము లభించి నప్పుడు మనమెట్లు ప్రవర్తించాలి? యితరులు దీవించ బడినప్పుడు క్రైస్తవుడు నిజముగా ఉల్లసించు స్వభావము కలిగి యుండాలి. అనేకసార్లు యితరుల సాధక బాధక ములను వినుటకు వారి ఆపదలలో సహాయపడుటకు మనము సులభముగా సంసిద్ధులగుదుము. గాని వారి సంతోషములో నిజంగా పాలు పొందుటకు, వారిని ప్రోత్సాహించు టకు మనకు చాలా కష్టతరముగా యుండును.

మన తోటివారిని గూర్చి యధార్ధమైన ప్రేమ సుహృద్భావ ములతో మనము నిండి యుండాలి. నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించుట యనునది పాత నిబంధనలో రెండవ ప్రాముఖ్యమైన ఆజ్ఞయని యేసు చెప్పెను (మత్తయి 22:37-40). ప్రేమ మత్సర పడదు అని పౌలు వ్రాసెను (1 కొరింథీ 13:4). యితరులకు మేలుకలుగగా మనము సంతోషించాలి. వారు దీవించ బడుచున్నందున కృతజ్ఞత చెల్లించాలి. మనమట్లు చేసిన యెడల మనము సంతోషముగా యుండుట యే గాక మన దేవుని సంతోష పెట్టిన వారమగుదుము.

– రానీ లోవే

# సంక్షిప్త వార్తలు

2018 మార్చి 26వ తేదీ సాయంకాలమునకు కవితాగూటం గారు, రిక్కీగూటం దంపతులు వారి బిడ్డలు జస్టిన్ మరియు రోజలిన్ గూటం గార్లు అమెరికాలో టెన్నిసీ రాష్ట్రముఖ్య పట్టణమైన మెంఫిస్‌కు క్షేమముగా చేరుకొనిరి. అక్కడ నివసించుచున్న రోనీగూటం దంపతులు వారిని తమ యింటికి తోడ్కొని వెళ్ళిరి.

2018 ఏప్రియల్ 10వ తేదీ తెల్లవారు జామున 3:45 నిమిషములకు రోనీగూటం గారి సతీమణి హరితా గారికి దేవుడు సుఖప్రసవముకలుగ జేయగా ఆదంపతులకు వారి ప్రార్థనల మేరకు ఎవిలిన్ ఫీయోనా అని నామకరణం చేయబడిన చక్కటి కుమార్తెను బహుమతిగా అందించిరి. ఆసమయమునకు రిక్కీగారి కుటుంబము కవితా గారు వారి దగ్గరనేయుండిరి. (ఆ బిడ్డ అమెరికా కాలమాన ప్రకారము ఏప్రియల్ 9వ తేదీ సాయంత్రం 5:15 నిమిషములకు జన్మించినది), తల్లిబిడ్డలిద్దరు ఆరోగ్య వంతులుగా యున్నారని తెలియజేయుటకు సంతోషించుచున్నాము. మీ ప్రార్థనల కొరకు కృతజ్ఞతలు తెలియజేయుచున్నాము.

రిక్కీ గారు కాకినాడలో నిర్వహించుచున్న చిల్డ్రన్‌హోమ్‌లో పనిచేయుచున్న సోదరుడు కోండ్రు ప్రకాష్(ఏడుకొండలు)గారు విష జ్వరము బారినపడి ఏప్రియల్ 9వ తేదీ రాత్రి ప్రభువు సన్నిధికిచేరుకొనిరి. 18వ తేదీన అయన ఓదార్పు కూటము వారి స్వగ్రామ మగు పాలగుమ్మిలో జరిగెను.

2018 ఏప్రియల్ 19వ తేదీ గురువారం కాకినాడ సమీపములో యున్న మాధవపట్నం శివారు పొట్టిలంకలో నిర్మించబడిన **క్రీస్తుసంఘఆలయమును** సోదరులు జాషువాగూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠించిరి. క్రీస్తుసంఘమే దేవుని మందిరమని, అది వరలోకపు గవిని యని ఆయన చక్కటి సందేశమునిచ్చిరి. అక్కడ బొండపాటి రాజారత్నం గారు, వారి తండ్రి రబీంద్రనాధ్ గారు సేవ చేయుచున్నారు. వచ్చిన వారందరికి స్థానిక సంఘము చక్కటి విందు నేర్పాటుచేసిరి.

2018 మే 9,10,11 తేదీలలో కాకినాద మెక్లారిన్ హైస్కూలులో 'యేసుక్రీస్తు రక్షణ సువార్త సభలు' జరుగును.వేలకొలది ప్రజలు ఆ కూటములకు హాజరగుదురు. సోదరులు వి.సహదేవ్,ఎ.విశ్వేశ్వరరావు,పి.వెంకట్రావ్,బి.జాన్‌రత్నం,జి.వంశిభూషన్ మరియు వి.రాజా విజయ్‌కుమార్ గార్లు ముఖ్యప్రసంగీకులుగా ఏర్పాటు చేయబడి యున్నారు.ఈ సభల కొరకు అందరు ప్రార్థించ మనవి.

2018 జూన్ 10 నుండి 18 వరకు కాకినాద సత్యవాణి-క్రీస్తుసంఘ ఆవరణలో యువతీయువకుల కొరకు వేసవికాల బైబిలు తరగతులు ఏర్పాటు చేయబడినవి. ఆ వివరముల కొరకు ఈ సంచిక టైటిల్ రెండవపేజీలో చూడండి.

అమెరికా నుండి వచ్చు యువతీయువకులు బైబిలు క్విజ్‌లు,కథలు,బైబిలు సంబంధమైన పోటీలు,ఇంగ్లీషు తెలుగు పాటలు వగయిరానేర్పుదురు.ఆహ్లాదకరమైన వాతావరణం,రుచి,శుచి గల భోజనం, ఆత్మీయసహవాసం,మంచి అనుభూతి ఆస్వాదించుట కొరకు ఈతరుణమును మీ సంఘములో యున్న యువకులు పంచు కొనుటకు వారికి తరుణమీయండి.వారితో కూడ తలిదండ్రులు గాని,సంఘ నాయకులు గాని రావచ్చును.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2018-20

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.